# కర్మ సిద్ధాంతం

మంచినీళ్ళకి బిందెతో పుల్లమ్మా, ప్రాంతః స్నానానికి రాగిజారీతో పేరక్కా తెల్లవారుఝామున నీళ్ళాటిరేవులో కలిశారు. పేరక్క అడిగింది:

"అయితే పుల్లా: నాకన్నా పది హేనేళ్ళు పెద్దదానివి. నెత్తిమీద కరవై ఏళ్ళొచ్చాయి. ఇంకా నీ కెప్పుడొస్తుందే జ్ఞానం? వెధవ సంసారంలో ఎప్పుడూ జలగలాగ కొట్టుకుచస్తే ఎలాగ? ముందుదారి చూచుకో అక్కర్లేదు టే?"

"ముక్తిమార్గాన్ని పడితే మంచిదే! అయితే అదెంతటివాళ్ళకక్కా. తీరిక ఉంటేనా? ఎంత చీకటితో లేచినా తెమలవు పనులు. ఇంట్లో పాచి, పిథిలో పాచి, మంచినీళ్ళు, పిల్లలకు చద్దెన్నాలు, ఇన్నీ పూర్తిచేసి పెడా పొయ్యిమీద దబ్బుని అవుతుందికదా అని వొండుతాను. పదీ కొట్టగానే పీటెక్కి పీకమీద కూచుంటాడు నా కొడుకు. ఉమ్మగిల్లని అన్నం, ముక్క ఉడకని పులుసు, పాపం! తిని ఆఫీసుకి పోతాడు. ఏమాట కామాట అనాలి కదూ? నా కొడుకే పల్లెత్తుమాటాడడు. ఇహను మధ్యాహ్నం, నడ్డివాల్చ డానిక్కాదు సరేకదా కోడికునుక్కైనా ఆసరాలేదు. పప్పులు బాగుచేసు కోడమో, పిండి విసురుకోడమో ఏదో ఆవేళకి పని ఉంటూనే ఉంటుంది. వ్యవధిలేదు!" అని జాదాబందీ చెప్పుకుంది పుల్లమ్మ.

"చాకిరీ! వెధవచాకిరీ! చేస్తే ఎంతేనా ఉంది సంసారానికి. సంసారమే పుల్లా! ఇదంతా సంసారమే! ఏమన్నాడు? కౌపీన సంరక్షణార్థాయ అయం పటాటోపః అన్నాడు. కోడళ్ళు వచ్చేకా ప్రాణానికి సుఖం లేక పోతే ఇంకా ఎప్పుడు? మొగుడు చచ్చినా, పిల్లలు ప్రాజ్ఞులైనా కూడా భూషణత్రయాలు కట్టికి వొదలకపోతే ఇంకా ఎప్పుడే?" అనడిగింది పేరక్క. సమర్థురాలు కాబట్టి అడిగింది.

పేరక్క మహావేదాంతి. ఇంట్లో కోడళ్ళకి పనిపాటల్లో పూతికపుల్ల సాయం చెయ్యదు. కాళ్ళుజాపుక్కూర్చుని అడ్డమైన చాకిరీ చేయించు కొంటుంది. మనమణ్ణి తెల్లారగట్ల లేపి పొరుగింటి వాళ్ళింట్లో దేవకాంచనం పువ్వులు దొంగతనంగా కోయించుతుంది. బియ్యంపెట్టి సజ్జడు పువ్వులు వాడికగా కొంటుంది. ఇంట్లో నందివర్ధనం పువ్వులు బుట్టడు ఏరుతుంది. దర్భాసనమెక్కి సహస్రనామావళిపూజ భోజనం వేళవరకూ చేస్తుంది.

లక్షవొత్తులవ్రతం, ఋషిపంచమినోము వగైరాలన్నీ ఉద్యాపనలు చేసింది. కాశీ వోమాటూ, రామేశ్వరం రెండుసార్లూ వెళ్ళింది. శ్రీశైలం, బదరీనారాయణం సేవించి చిల్లర మల్లర యాత్రలన్నీ చేసింది.

ఎవర్నిపడితే వాళ్ళని వేదాంత విషయాల్లో టకాయిస్తుంది. వాటిలో సంస్కృతిగల ఘనాపాటీ. భారత, భాగవతాది పురాణాలన్నీ తెలుసు. శ్రీసూక్తం, పురుషసూక్తం వగైరాలన్నీ నాలికచివరున్నాయి. భజగోవిందం, శివానందలహరి, శ్రీకృష్ణకర్ణామృతం, యక్షగానాలు, తత్త్వాలు, శివకీర్తనలు, విష్ణుకీర్తనలు వందలూ వేలు కంఠతా. హేమా హేమీల్లో నిలబడి మాట్లాడగల వక్త.

"—ఈషణత్రయాలు కట్టెకి వదలకపోతే ఇంకా ఎప్పుడే?" అనడిగింది. పుల్లమ్మ కదంతా బోధపడక పిచ్చిపుల్లమ్మలాగ చూచింది. ఆవిడ సాయానికి ఇరుగమ్మ వొచ్చింది. ఇంత ఘనాపాటి పేరక్కకి ఇరుగమ్మంటే హడలు.

"పేరక్కా! నువ్వు వెయ్యి చెప్పు, నూరు చెప్పు. జనక మహారాజులాగ సంసారంలో ఉండే సాధించవచ్చు. నువ్వు చెయ్యడమే కాకుండా, ఊరందరినీ ఏ వ్రతాలో చెయ్యమని బాధపెట్టకు!" అన్నాది ఇరుగమ్మ. ఆవిడ సత్సంగి. ఆవిడకి తీర్థయాత్రాభిగమనం, వ్రతాదులూ చేసి వెధవ్వాళ్ళ సంసారాలని గుల్ల చెయ్యడం ఇష్టంలేదు. పేరక్క ఎవరింటి కెళ్ళినా ఎవరితో ప్రసంగించినా ముప్పువొస్తుంది. ప్రతి ఆడదానికీ వొక వ్రతం పిచ్చి పెడుతుంది.

"ఛాల్లే నువ్వు మాట్లాడకు. నీకూ మా తెలిసినట్టు!" అన్నాది పేరక్క.

"ఆఁ! నీబోడి వేదాంతం నాకూ తెలుసు. పుల్లమ్మా వెనకటికి ఆచంట దేముడికథ విన్నావూ?" అనడిగింది ఇరుగమ్మ. ఆచంటలో పుల్లమ్మ కొడుకు కొన్నాళ్ళు ఉద్యోగం చేశాడు. అంచేత ఆ కథ తెలుసు.

"పరమశివుడు మహా శివరాత్రిపూటా సానింటి కెళ్ళిన వాడికిచ్చేడు మోక్షం. నువ్వు, పుల్లా, సంసార తాపత్రయం పడ్డమే మంచిది. ఈ పిచ్చి లకి పోకు!" అని ఇరుగమ్మ సలహా ఇచ్చింది.

"తేగా తేగా మంచి సామ్యం తెచ్చావు. బూతుసామ్యం!" అని కుళ్ళి కుళ్ళి నవ్వి చచ్చింది పుల్లమ్మ.

"పుల్లా! ఏమీ ఎరగని నీకు ఏకాశిచావూ, అన్నీ తెలుసునని విర్ర వీగే పేరక్కకి మురికిచావూ తప్పవు. తెలిసిందా?" అంటూ బిందె బుజా న్నేసుకొని వెళ్ళిపోతోంది ఇరుగమ్మ.

"నిలబడు! నిలబడి వాదనలోకి దిగి నిలబడు, వెళ్ళిపోవడంకాదు!" అని సవాలు చేసింది పేరక్క.

"ఈషణత్రయాలూ నీ మొహమున్నూ! అంత వేదాంతివైతే ఉన్న లొడ్డూ లొస్కూ నలుగురికీ పంచిపెట్టి, కాషాయగుడ్డలు కట్టుకొని సాధు వమ్మవైపో. నీతో వాదిస్తే, నాకేం ముక్తిరాదు. నోటితుంపర్లు దండుగ. ఇంటికెళ్ళి పిల్లలకింత అన్నంపెట్టి ఒకరికింత ఉపకారం చేస్తే ఉన్నాది వెళ్ళు, వెళ్ళు!" అని వెళ్ళిపోయింది ఇరుగమ్మ. ఆవిడదగ్గర పేరక్క నోరు లేచిందికాదు.

"వెధవముండ ఎక్కడేనా దొరకదా? అప్పుడడుస్తాను దీనిగర్రా. దీనికెలాగా పుట్టగతుల్లేవు నానోటితో బెందుకనాలి? దీనికి పోగాలం. కాశీ గుమ్మంలోంచి దయాల్బాగు వెళ్ళింది. విశ్వనాథుడి దర్శనం చేసిందికాదు. కాశీవిశ్వనాథుడు కూడా దీని దెయ్యాలబాగుకి తక్కువేట!" అన్నాది పేరక్క.

"పేరక్కా! నిజంగానే కాశీ వెళ్ళడం మానేసిందీ?" అనడిగింది పుల్లమ్మ.

"అయ్యో నిజం! రేపు దాన్నే అడుగు, అదో గొప్పలాగ గుండా డిస్తూ చెప్పుకుంటుంది!"

పుల్లమ్మకది పెద్ద పాతకంలాగే కనబడ్డాది. కాశీకన్నా ప్రపంచంలో గొప్ప వున్నాయంటే ఆవిడ ఎలాగ నమ్ముతుంది?

పేరక్క పుల్లమ్మ దగ్గర వంద శ్లోకాలూ, పద్యాలు చదివి, ఇరుగమ్మని తిట్టి "ముందుదారి" గురించి బోధచేసింది. కాని పుల్లమ్మకేం బోధ పళ్ళేదు. ఆఖరికి పేరక్కతో మధ్యాహ్నం శివాలయంలో మహా భారత పురాణశ్రవణానికి మాత్రం తెరిపిచేసుకొని వెళ్ళడాని కొప్పుకుంది. పేరక్క మందలోంచి దారితప్పి అంధకారంలో పడిపోయిన గొఱ్ఱెని మందకుక్కలాగ మళ్ళీ తోవలో పెట్టడానికి పూనుకుంది.

పుట్టి పురుషుడు యజ్ఞం చేసేదని పుల్లమ్మ పురాణానికెళ్ళింది. కోలాహలంగా ఉంది శివాలయం. మంటపం తోరణాలతో అలంకరించారు. దానిమీద కూర్చుని అట్టహాసంగా తయారై కాశ్మీరశాలువా కప్పుకొని ఉగ్లాం పండితుడు భారత పురాణం చెపుతున్నాడు. గుడి నిండిపోయింది.

పేరక్క పుల్లమ్మతో రావడం ఆలస్యమైనా జనాన్ని తోసుకొని, అందర్నీ నెట్టేస్తూ, మంటపంముందు కెళ్ళి పండితుడికీ, వ్యాసపీఠానికీ నమస్కారాలు చేసి అందరిమధ్యా ఇరికింది. పుల్లమ్మనీ ఇరికించి కూచో పెట్టింది. పక్క బోడెమ్మలంతా పళ్ళు కొరుక్కుని మెటికలు విరిచారు.

"వెనకంత చోటుంది. ఇక్కడే దూరాలా?" అన్నాది సాహసించి ఒకర్తె.

"అర్థం చేసుకోగలను గదా అని ముందుకూర్చున్నాను. మీలాంటి దాన్నే అయితే వెనక్కే పోదును!" అన్నాది పేరక్క, తేలుకొండిలా నాలికాడిస్తూ. ఆ గోరోజనం జవాబుకీ, ఆ బాబాక్రమానికీ ఎవరూ ఎదు ర్కొలేకపోయారు. అంతట్లో పండితుడే పేరక్క పక్షం మాట్లాడేరు.

"కూర్చోండి పేరక్కగారూ! కూర్చోండి. జాగా చెయ్యండమ్మా! పేరక్కగారిలాంటి వేదాంతులు నలుగురొస్తేనే సభ ఇప్పుడెంతో నిండు వొచ్చింది. 'రెడ్డివొచ్చేడు మొదలెట్టండి' అన్నారుట. అలాగ్గా మళ్ళా ప్రారంభిద్దాము." అని ప్రారంభించిన కథావిధానం మొదటనుంచీ మళ్ళా ప్రారంభించారు పండితులు.

"ఒసేపుల్లా! చూశావా! ఈ వెధవాలంతా నేను ఉఫ్ - అని ఊత్తే ఎగిరిపోతారు" అని అప్పుడు పేరక్క సభాసదులందర్నీ విజ

యంతో సింహావలోకనం చేసింది. పేరక్క చాలా గొప్పదనుకొంది పుల్లమ్మ.

శాస్త్రులుగారు మకరకుండలాలాడించుకొంటూ సింహతలాటం మురుగులతో హస్తవిన్యాసాలు చేస్తూ శలవిచ్చారు :

"గాంధారి మహాపతివ్రత. నూరుగురు కొడుకుల్ని కన్నాది. దుర్యోధన సంపత్తి ఆర్యావర్తమంతా పేరుపడ్డాది. అలాంటి కౌరవులంతా సమరంలో సమసిపోయారు. గాంధారి నూరుగుర్ని కన్నా పుత్రశోకం తప్పింది కాదు. చూశారా?

"కర్మ తప్పించుకోవడం బ్రహ్మతరం కాదు. శ్రీరామచంద్రుడికి అరణ్యవాసం, భార్యావియోగం తప్పేయికావు. శ్రీనాధుడంతటి మహాకవీశ్వరుడికి తిలపిష్టం వెల్లుల్లితో విశ్వస్థ వడ్డించగా తిండం తప్పింది కాదు.

"పుణ్యపాపాలు రెండూ ఒక్కటే. పాపం చేస్కుకొన్న వాళ్ళు దేహులై వారివారి కర్మల ననుసరించి పుడతారు. పుణ్యం చేసుకోడం అంటే స్వర్గలోకానికి టిక్కెట్టు కొనుక్కోవడం. అక్కడికెళ్ళిన తరువాత పుణ్యం క్షీణించగానే మళ్ళా మర్త్యలోకం సంప్రాప్తిస్తుంది.

"అంచేత పుణ్యపాపాలు రెంటికీ ఆశించకుండా భగవంతుణ్ణి కొల్చిన వాడికే జన్మరాహిత్యం లభిస్తున్నాది.

"కర్మ తెలిసి చేసినా తెలియక చేసినా అనుభవించక తప్పదు. అగ్నిహోత్రంలో చెయ్యి ప్రమాదాన్ని పెట్టినా కాలుతుంది. కందుకాన్ని కొడితే మీదికి తుళ్ళుతుంది. చేతిలోంచి జారి క్రిందపడ్డా త్రుళ్ళుతుంది."

"చూడే పుల్లా! ఘటాని కెన్ని ఉన్నాయో?" అన్నాది పేరక్క.

"అదేమిటో అంతా గోలగా ఉందే! బోధ పళ్ళేదు" అని తల గోక్కుంది పుల్లమ్మ.

"అజ్ఞానికి బోధపడదు. అయితే ఏం చెప్పేడు? చదివిన, వినిన పఠించిన అన్నాడు. విన్నా కొంత ముక్తి ఉన్నాది" అని చెప్పింది పేరక్క. పోనీ నాకూ కొంత ఉందికదా అనుకొంది పుల్లమ్మ.

గాంధారి పుత్రశోకానికి కారణం శాస్త్రిలు వారు శలవిచ్చారు. విశ్వ రహస్యాన్ని సాధించేమన్న వేదాంతోత్తములు ఈమాత్రం కారణం చెప్ప లేరూ?

గాంధారి తొలిజన్మలో గంజి కన్నంలోకి వార్చింది. అది ఎల క్కన్నం. సళసళ ఉడుకుతున్న గంజిపడి కన్నంలో నూరు ఎలకపిల్లలు కుతకుత ఉడికి చచ్చాయి. తెలియకచేసినా ఆపాపం ఈ జన్మలో అనుభవిం చక తప్పిందికాదు.

"అయితే పేరక్కా! ఎలక నూరుపిల్లల్ని పెడుతుందా?" అనడి గింది పుల్లమ్మ.

"బాగానే ఉన్నాయి వెధవ ప్రశ్నలు" అన్నాది పేరక్క.

"నాకు తెలియక అడిగానే!"

"ఇహ నువ్వు విననివ్వవులాగుంది."

"ఇల్లు నేస్తూ ఉంటే ఎలకగూట్లో ఎనిమిది పిల్లల్ని చూశానే. ఎలక ఒక్కమాటు నూరుపిల్లల్ని కంటుందా!"

"వెధవ ప్రశ్నలు! గాంధారి నూరుగుర్ని కన్నాది. నువ్వెక్కడేనా ఎరుగుదువా? ద్రౌపదికి ఐదుగురు మొగుళ్ళు. నీకున్నారా?"

"ఆ, పదిమంది మొగుళ్ళని పెట్టుకొని తిరుగుతున్న ద్రౌపదిని నే నెరుగుదును" అన్నాది సమయంకోసం కనిపెట్టుకుని ఉన్న ఒకావిడ.

"అనండి, అనండి, ఇలాంటివే నవ్వుతూ చెయ్యడం, ఏడుస్తూ అనుభ వించడం! ఈ సంచితార్థం ఊరికే పోదులెండి" అని శాపనార్థాలు పెట్టింది పేరక్క. నేరకపోయి అన్నానురా దేముడా అని ఇరుకునపడి చచ్చింది పుల్లమ్మ. గాంధారి నూరుగుర్ని కన్నాదన్నా, ఎలక కన్నాదన్నా ఆశ్చ ర్యంగానే ఉన్నాది కాని, పుల్లమ్మ 'అవును కాబోలు నాకు తెలియదు' అను కొన్నాది.

సాయంకాలం ఐదుగంటలదాకా పురాణం చెప్పుతారు పండితులు. ఆ తరువాతకూడా ఉండి ధర్మసందేహాలన్నీ అడిగి తెలుసుకొని పేరక్క పండితునితో కలిసి ఇంటికి బయలుదేరుతుంది. ఆవేళ మూడు గంటలకల్లా గాలీ, మేఘం ముంచుకొచ్చేయి. ఇళ్ళకి చాలామంది తోవతీశారు.

"పేరక్కోయ్ మేఘ మెత్తింది!" అన్నాది పుల్లమ్మ.

"ఇంటికన్నా గుడి పదిలం. వెచ్చగాకూర్చో, వెలిశాకే వెళదాము" అన్నాది పేరక్క.

"ఆవకాయే!"

"కోడలుత్తొత్తు ఎత్తదూ?"

"ఇంకానయం. నిండుచూలాలు. తొత్తులంజా. అవేమిటే ఆ మాటలు?"

"అయితే ఏమంటావు?"

"పోదాం!"

"వెధవ సంతలాగే ఉంది. నిన్ను తీసుకురావడం తప్పు. ఇక్కడికెళ్ళినా ఏగాణీయే! వెళ్తే నువ్వెళ్ళు. నేన్రాను!" అని చెప్పేసింది.

పుణ్యానికిపోతే పులెత్తుకు పోయిందిట. రూపాయిల దొంతిలకి దొంతులు పెట్టి పెట్టుకొన్న ఆవకాయ. సంవత్సరం తినవలసిన వస్తువు. పుణ్యం పురుషార్థం నాకెందుకని పుల్లమ్మ వెళ్ళిపోయింది.

పరుగు పరుగునపోయి తలుపుతట్టింది. తలుపు మనమడు తీశాడు. పెరట్లోకి వెళ్ళింది. దొడ్లో ఆవకాయ లేదు. అరుగుమీన జుత్తారబెట్టు కొంటోంది కోడలు.

"నెత్తివాయించా? స్నానం చేసి ఆవకాయ ఎత్తేవా? నిండుచూలా లివి!" అన్నాది పుల్లమ్మ.

"ఇంకా నయం వెళ్ళక వెళ్ళక పురాణాసికెళ్ళారు!" అని అభిమానం చూపించింది కోడలు.

వానాలేదు. వాంగుడూలేదు. గాల్తో కొట్టుకుపోయింది.

రాత్రి భోజనాలయాయి. పుల్లమ్మ తిండితిని ఎంగిలాకుతో వీధిలో కొచ్చింది. గుమ్మంలో వీధి పెట్రోమేక్సులైటు వెలుగుతోంది. చేతిలో ఎంగిలాకుని ఎగిరి అందుకోడానికొచ్చింది ఊరకుక్క. "ఛీ ఛీ ఛీ! వెధవముండా! నీ నెత్తి వాయించిరిగదే!" అని కుక్కని కసిరికొట్టి దూరంగా రోడ్డువారకి ఎంగిలాకుని పారేసింది. కీచుకీచంటూ పందిపిల్ల వొచ్చి ఎంగిలాకులో మామిడిటెంకని కరచుకొని కొరకడానికి స్వాధీనం కాక తిప్పలు పడుతున్నాది. దానిమీద ఊరకుక్క "బొంయ్యి"ని పడి పీక కరిచింది. మెడదగ్గర తెగిపోయి రక్తం బొటబొట కారుతూ, ఏడుస్తూ

పడిపోయింది పందిపిల్ల. దొడ్లోంచి తల్లిపంది మదుంకంపు కొడుతూ "ఘర్ ఘర్" మని కుక్కమీదికి యుద్ధాని కొచ్చింది. దానివెంట వొచ్చాయి దాని పదిపిల్లలూ సొలక్కి సొలాగా. పక్కవీధిలోంచి రేచుకుక్క చప్పుడు కాకుండా వొచ్చి పడ్డాది. ప్లీడరుగారి పెంపుడుకుక్క "ఒలీవ్యా" ఒచ్చింది. కుక్కలు మూడు ఏకమై పందుల్ని వెంటపెట్టేయి. కాలభైరవుడి దగ్గర వరాహావతారం పరారీ అయిపోయింది. పందిపిల్ల మూలిగి, మూలిగి చచ్చింది.

రేచుకుక్క విస్తర్నంతా తన స్వాధీనం చేసుకొంది. ఊరకుక్క మూతిపెట్టబోయింది. రేచుకుక్క నిప్పులు కక్కుతూ చూచి "య్యాఁ" అని కరవడానికి పళ్ళిగిలించింది. "కుయ్యోఁ" అంటూ ఊరకుక్క దూరంగా పోయి తోక ముడుచుకొని చూస్తూ నిలబడ్డాది. "ఒలీవ్యా" ఒచ్చి విస్తర్ని లాగింది. రేచుకుక్క దాన్నేమనలేదు. "ఒలీవ్యా" ఆడకుక్క.

పుల్లమ్మంతా చూసింది. పందులమీద జాలి, కుక్కలమీద కోపం వొచ్చింది. కింది రాయినితీసి ఫైట్టని కొట్టింది. ఇంత రేచుకుక్కా అన్ని కుక్కల్లాగే "కయ్యోఁకయ్యోఁ"మని కుంటుకుంటూ పారిపోయింది.

పుల్లమ్మ సంతుష్టిపడి ఇంట్లోకెళ్ళి పనులు చక్కబెట్టుకొని పక్క వేసింది. కాని నిద్రపట్టలేదు. ఆవిడ జన్మంలో ఏ విషయంమీదా బుర్రతో ఆలోచించి ఎరగదు. ఆవిడ బతుక్కి ఆలోచించవలసిన అవసరంకాని, విషయాలుకాని లేవు. ఆ రాత్రిమాత్రం ఎక్కళ్ళేని దీర్ఘాలోచనా పట్టుకుంది.

గాంధారికథంతా తనలోతాను పూసగుచ్చి చెప్పుకుంది. తెలిసి చేసినా తెలియక చేసినా కర్మ అనుభవించక తప్పదన్నాడు శాస్త్రులు. సబబుగానే కనబడ్డాది కర్మవాదం. పురాణంలో వాళ్ళని పేరక్క ఏమ న్నాది? "నవ్వుతూ చెయ్యడం ఏడుస్తూ అనుభవించడం." ఆలోచించగా ఆలోచించగా వెర్రెక్కువై పోయింది. ఎంగిలాకు పారేస్తే జరిగిన కుక్క జట్టీ జ్ఞాపకం వొచ్చింది. పుల్లమ్మ తల వేడెక్కింది. ముచ్చెమట్లు పోశాయి. గుండె గడగడ లాడిపోయింది.

ఆ కుక్క జట్టీకి తనే కారణం! బద్దకించకుండా తనేకాని నాలుగడు గులువేసి డొక్కులో ఎంగిలాకు పారేస్తే ఆ జట్టీ రాకపోను! పందిపిల్ల ప్రాణాలు దానిమూలంగా పోయాయి! కుక్కల సిద్ధాన్నం రాయితో కొట్టి

పాడుచేసింది. వాటన్నిటికి బ్రహ్మదేముడేం శిక్షలు విధిస్తాడో? చచ్చి పోతున్న పందిపిల్ల కళ్ళకి కట్టింది.

"హమ్మో!" అన్నాది పుల్లమ్మ. పందిపిల్ల మూలుగుతూ, గింజుకుంటూ, నీలుగుతూ కనబడ్డాది.

"హమ్మో!" అని మళ్ళా గట్టిగా కేకేసింది పుల్లమ్మ. ఆమెతల గిర్రని తిరిగిపోయింది. పంచప్రాణాలు ఎగిరిపోయాయి. పెరటితలుపు ఠడీమని తీసింది. అవతల కెళ్ళింది. తులసికోటకి సాష్టాంగపడిపోయి గట్టిగా వెంకటరమణమూర్తి పూనిన వాళ్ళలాగ అరచింది.

"శ్రీమన్నారాయణమూర్తీ! తండ్రీ! మహాప్రభో! వరప్రసాది నువ్విచ్చిన కొడుకు నాకొక్కడే తండ్రీ! నేను తెలియక చేసిన పాపాలు మన్నించు నాయనా! పందిపిల్ల చచ్చిపోయిందని ఆ పాపం నా నెత్తిని రుద్దకు బాబో! నా కొడుకు ప్రాణాలు కాపాడు. వాడి చేతిమీదుగా నా ప్రాణాలు తీసుకుపో శ్రీమన్నారాయణమూర్తీ...." అంటూ దండకంలాగ ప్రారంభించింది.

ఆ గోలకి కొడుకూ, కోడలూ, పిల్లలూ లేచివొచ్చేరు.

"ఏమిటే అమ్మా?" అని కొట్టి కొడుకు అడిగాడు.

"ఇంకేమిటి కావాలి నాయనా? నీ పీకమీదికి తీసుకొచ్చేను. ఆ పందిపిల్ల నామూలాన్ని చచ్చిపోయింది. గాంధారికి వేసినట్టే ఆ శిక్ష నాక్కూడా వెయ్యొద్దని దేముణ్ణి ప్రార్థిస్తున్నాను!" అన్నాది పుల్లమ్మ.

"పీడకలొచ్చింది" అన్నాది కోడలు.

"పీడకల కాదర్రా, పీకెండిపోతున్నాది. మంచినీళ్ళుతెండి. చెపతాను" అన్నాది.

నీళ్ళుతాగి, తాపీగా ప్రాణాలుపోతున్నట్టు హీనస్వరంతో చెప్పింది. పేరక్క ముక్తిమార్గం చూచుకోమనడం, పురాణానికి వెళ్ళడం, గాంధారి కథ, కౌరవుల చావు, తన మూలాన్ని ఎంగిలాకు పారేస్తే కుక్కజట్టీ, పందిపిల్లి చావూ.

"ఒస్నిదిటే! నా ప్రాణాలకేమీ భయంలేదు. కావలిస్తే రోజుకో జంతువుని చంపు. నీకేం తఖరులేదు. పోయిపడుకో!" అన్నాడు కొడుకు.

"లేదురా, అలాగ జరుగుతాయటరా. తెలిసి చేసినా తెలియక చేసినా పాపకర్మం అనుభవించక తప్పదుటరా!" అన్నాది పుల్లమ్మ.

"పేరక్కపాటి, ఆ పండితుడుపాటి నాకూ తెలుసు. ఈ ప్రపంచంలో పాపం చేసినవాడికి భగవంతుడు శిక్షవెయ్యడం లేదు. ఖూనీలు చేసినవాళ్ళు, కొంపలు కూల్చినవాళ్ళు బాగానే ఉన్నారు; దేముడు శిక్ష వేస్తున్నది అమాయకత్వాన్ని, తెలివితక్కువతనాన్ని. ఇంతకీ మూలం పేరక్కకదా? దానిసంగతి తెలుసా? దానికి ఆ ఉర్లాంపండితుడికీ ......." అంది కోడలు.

"ఏమిటేమిటి?" అన్నాది పుల్లమ్మ.

"దాని ధైర్యంమీదే ఇన్నాళ్ళు ఇక్కడ తిష్టవేశాడు."

"నిజమే?"

"అబద్ధ మనుకున్నా వేమిటి?"

"నలభై ఏళ్ళు దాటిన మనిషి. జ్ఞాని...."

"నలభై ఏళ్ళుదాటినా నీ కోడలుకన్నా అదే గట్టిగా ఉంది. జ్ఞానికనకే ఈ పనులు!"

"కొడుకులున్నారు. ఊరుకొంటున్నారా?"

"ఊరుకోక ఉరెట్టుకుంటారటే అమ్మా? దాని దగ్గర డబ్బుంది. దెబ్బలాడితే అది పట్టుకొని లేచిపోతుంది. పండితుడితో కాశీకి పారిపోతే పుణ్యం పురుషార్థం కూడా దక్కుతాయి!"

"అలాగ చెప్పు. అందుకే అంతా పేరక్కని యీసడిస్తూ వొచ్చేరు. ఇదేనా బోడిద్రౌపది? ఇంకెవరో అనుకొన్నాను!"

"ఇహ వెళ్ళు."

"అయితే ఫరవాలేదంటావు?"

"నీ మొహం, వెళ్ళు!" అని కొడుకు ఒక్కకసురు కసిరేడు.

అప్పుడు పుల్లమ్మ కుదుటపడ్డాది.

కాలచక్రం తిరగడంలో పాపపుణ్యాల పర్యవసానం మరచిపోయింది పుల్లమ్మ. మళ్లా పనసపండులాంటి మనుమణ్ణెత్తింది. బారసాల పీటలమీద

కొడుకూ, కోడలూ కలకల్లాడుతూ కూచున్నారు. బారసాల వంటంతా బ్రాహ్మణ్ణి పెట్టకండా పుల్లమ్మే వండింది. తిన్నవాళ్ళంతా పాకం మా బాగుందన్నారు. వచ్చిన వాళ్ళంతా "కడుపుచలవ పుల్లమ్మ" దన్నారు.

"వాళ్ళు చల్లగా పదికాలాలు వుండడమే నాక్కావలసింది. ఇహన్నే నెలాగా వెళ్ళిపోవలసిందాన్నే. మనుమడికి వొక జంజ్యం పడేస్తే ఆ బూరె ముక్కతిని చచ్చిపోతాను!" అన్నాది పుల్లమ్మ.